www.aksharadarbar.com
గురువారం 04, ఏప్రిల్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :56 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

రాజ్యసభ సభ్యురాలిగా సోనియాగాంధీ ప్రమాణస్వీకారం

03

నైరాశ్యం

తాజా పరిణామాలతో వరంగల్ కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి

- కడియం కావ్య అభ్యర్థిత్వంపై వ్యతిరేకత
- ఎన్నికల వేళ జనం వద్దకు వెళ్లడానికి నిరాసక్తత
- ప్రజల్లోనూ కావ్య అభ్యర్థిత్వం పట్ల ప్రతికూల స్పందన
- కాంగ్రెస్ విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం

04

కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో రెట్టింపు ఉత్సాహం కనబరిచిన కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక్కసారిగా నైరాశ్యం చోటు చేసుకుంది. పార్టీలో జరిగిన తాజా పరిణామాలతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రధానంగా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అధిష్టానం కడియం కావ్యను అభ్యర్థిగా ఖరారు చేయడాన్ని హస్తం కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. పార్టీలో సభ్యత్వం కూడా లేని కడియం కావ్యను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం వారిని నిరుత్సాహపరిచింది. ఇదే సమయంలో కడియం కావ్య తండ్రి స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీలో మంత్రిగా పనిచేసిన సమయంలో ఇక్కడ తమకు ఎదురైన అనుభవాలను కాంగ్రెస్ పార్టీ కేడర్ ప్రస్తుతం నెమరు వేసుకుంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కడియం కావ్య గెలుపు కోసం ప్రజల వద్దకు వెళ్లడానికి నిరాసక్తత చూపుతుంది. ఇది వరంగల్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయ అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీ అభ్యర్థిగా కడియం కావ్యం ఖరారు చేయడం పట్ల ప్రజల నుంచి కూడా ప్రతికూల స్పందన కనపడుతున్నట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ నేతలు వద్దనుకుంటే కాంగ్రెస్ పార్టీ మళ్లీ వారినే తమ ముందుకు తెస్తుండటాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోని మాదిగ సామాజిక వర్గం కడియం కావ్యకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వరంగల్ నుంచి టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కావ్య అభ్యర్థిత్వాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కడియం కావ్య అభ్యర్థిత్వంపై వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు

రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

03

పీడీఎస్ బియ్యం పట్టివేత

04

ఆర్డీవో కార్యాలయం జప్తు ఆదేశించిన కోర్టు

నష్టపరిహారం చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం

02

కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

02

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

అక్షర దర్బార్, ఢిల్లీ : మద్యం కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ పిటిషన్ పై తీర్పును రౌస్ అవెన్యూ కోర్టు రిజర్వ్ లో పెట్టింది. సోమవారం తీర్పు వెలువడనుంది. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌పై రిజాయిండర్ ను ఆమె తరపు న్యాయవాదులు దాఖలు చేశారు. మైనర్ కుమారుడి పరీక్షల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమె పిటిషన్ వేశారు. ఎమ్మెల్సీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. అయితే బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని, ఆమెకు వ్యతిరేకంగా చాలా ఆధారాలు ఉన్నాయని ఈడీ వాదించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి కవితే

ప్రణాళిక రచించారన్న ఈడీ, ఆమె తన ఫోన్ డేటాను డిలీట్ చేశారని కోర్టుకు తెలిపింది. దర్యాప్తులో అడిగిన ప్రశ్నలకు కవిత సమాధానం ఇవ్వలేదని, ఆమె 10 ఫోన్లు ఇచ్చినా, అన్నీ ఫార్మాట్ చేసే ఇచ్చారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కోర్టుకు వివరించారు. ఈ కేసులోని నిందితులు వందల డిజిటల్ డివైజ్‌లను ధ్వంసం చేశారని, అప్రూవర్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దని కవిత బెదిరించారని ఈడీ అధికారులు ఆరోపించింది. కుమారుడి పరీక్షల కారణంగా బెయిల్ ఇవ్వాలన్న కవిత వాదనను ఈడీ వ్యతిరేకించింది. ఆమె చిన్న కుమారుడు ఒంటరి వాడు కాదని, అతనికి సోదరుడు, కుటుంబసభ్యులు తోడుగా ఉన్నారని కోర్టుకు వివరించింది. పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 8న మధ్యంతర బెయిల్ పిటిషన్ పై తుది ఉత్తర్వులు ఇవ్వనున్నారు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 20న వాదనలు జరగనున్నాయి.

కాంగ్రెస్ లో చేరిక

అక్షర దర్బార్, జనగామ: జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. జనగామ పట్టణం, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలకు చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా, మండల నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై వారు పార్టీ చేరారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో జనగామ పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్ బొట్ల శ్రీను, పెంబర్తి మాజీ సర్పంచ్ అంబాల ఆంజనేయులు గౌడ్, మిషనరీ సంస్థల అధినేత బక్క ప్రవీణ్ కుమార్, తరిగొప్పుల మండలం అక్కరాజు పల్లి మాజీ ఎంపీటీసీ జొన్న గాని కిష్టయ్య, బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి మల్లేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మల్లం శ్రీశైలం తదితరులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరినారిన వారిలో ఉన్నారు.

హస్తం గూటికి జెడ్పీటీసీ

అక్షర దర్బార్, జనగామ: జనగామ జిల్లా లింగాలఘనపూర్ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి హస్తం గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పాక్స్ ఛైర్మన్ బుషిగంపల ఉపేందర్, మాజీ జెడ్పీటీసీలు పోకల శంకరయ్య, గంగసాని రంజిత్ రెడ్డి, పాక్స్ వైస్ ఛైర్మన్ చౌదరిపల్లి విజయ్ భాస్కర్, పాక్స్ డైరెక్టర్ లు గుర్రం బాలరాజు, వేముల కృష్ణా రెడ్డి, మాజీ సర్పంచ్ దుసరి గణపతి, చిట్ల స్వరూప రాణి, కదారి కృష్ణా, కాటం విజయ కుమార్, శేకర్ రెడ్డి, పెండ్లి దేవేంద్ర మోహన్ రెడ్డి, తుంగ స్రవంతి, నాగరాజు, భవాని, రాంబాబు, గారు , సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లు గుర్రం యాదగిరి, గాడిపెల్లి శ్రీనివాస్, మీసాల కృష్ణా, గవ్వల మల్లేష్, వీరాస్వామి, నాయకులు సోమ నర్సయ్య, మల్లయ్య, గోవర్ధన్, మల్లయ్య, ఆంజనేయులు, ఉపేందర్, జంపన్న తదితరులు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో వారంతా కాంగ్రెస్ లో చేరారు.



అప్రమత్తతో విధులు నిర్వహించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బందితో పాటు సెక్టార్ విభాగం ఎస్.ఐలతో వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా బ్లూకోల్ట్స్ సిబ్బంది నిర్వహించిన విధులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. వారికి అప్పగించిన విధులు నిర్వహిస్తున్న తీరుతెన్నులపై సీపీ ఆరా తీసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఫిర్యాదు రావడంతో క్షణాల్లో స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్ సిబ్బందిపై ఉందన్నారు. వచ్చిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో నిజాయితో దర్యాప్తు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా ప్రజలకు పోలీసులపై గౌరవం పెరుగుతుందని తెలిపారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తమ పరిధిలో ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ముందస్తు సమాచారం అధికారులకు చేరవేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతలను పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. సిబ్బంది పనితీరు పై అధికారుల దృష్టి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పరిపాలన అదనపు డిసిపి రవి, ఏసిపిలు జితేందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఇన్ స్పెక్టర్లు సంతోష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం జప్తు

ఆదేశించిన కోర్టు

నష్టపరిహారం చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఆర్డీవో కార్యాలయం, కార్యాల ఆస్తులు జప్తు చేయడానికి న్యాయస్థానం ఆదేశించింది. ఈ క్రమంలో ఆస్తుల జప్తు కోసం అధికారులు ఆర్డీవో కార్యాలయానికి రావడం చర్చనీయాంశమైంది. అడ్వకేట్ నాగేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట గ్రామంలో ఏర్పాటుచేసిన టెక్స్ టైల్ పార్క్ కోసం అధికారులు భూసేకరణ చేపట్టారు. భూసేకరణ సమయంలో తక్కువ నష్టపరిహారం ఇచ్చారని ఇద్దరు వ్యక్తులు భూసేకరణ అప్పిలేట్ అధికారికి అప్పీలు చేసుకున్నారు. అప్పీలు అనుమతి పొందింది. దీంతో వారికి పరిహారం రూ.2 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. కానీ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పరిహారం చెల్లించడం లేదు. అప్పిలేట్ అధికారులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అన్ని అంశాలు పరిశీలించిన న్యాయస్థానం ఆర్డీవో కార్యాలయం, ఆస్తుల జప్తుకు ఆదేశించింది. దీంతో అధికారులు జప్తు చేయడానికి ఆర్డీవో ఆఫీసు కు రావడం ఉత్కంఠ నెలకొంది.

రాజ్యసభ సభ్యురాలిగా సోనియాగాంధీ ప్రమాణస్వీకారం

అక్షర దర్బార్, ఢిల్లీః రాజ్యసభ సభ్యురాలిగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ గురువారం ప్రమాణస్వీ కారం చేశారు. ఆమెతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణస్వీకారం చేయించారు. సోనియా రాజ్యసభ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నలుగురికి తీవ్రగాయాలు

అక్షర దర్బార్, జనగామః జనగామ జిల్లాలో రెండు కార్లు ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి టోల్ గేట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ కు చెందిన వ్యక్తులు తిరుమలగిరిలో జరిగిన ఓ వేడుకకు హాజరై కారులో తిరిగి వెళ్తున్నారు. దేవరుప్పులకు చెందిన వారు మరో కారులో జనగామ వచ్చి వెళ్తున్నారు. ఈ కార్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జిల్లా హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

5న సదరం స్లాట్ బుకింగ్

అక్షర దర్బార్, మహబూబాబాద్ః సదరం ధ్రువీకరణ పత్రాలకు అర్హులైన వారు ఈ నెల 5న ఉదయం 11 గంటల నుండి స్లాట్ బుక్ చేసువచ్చని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు వైద్య పరీక్షలను ఏప్రిల్ 10, 24 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల10న రెన్యువల్స్ వారికి, కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందడానికి 24వ తేదీ స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ వారి కోసం 150, కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందుటకు 150 మొత్తం 300 స్లాట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు.

వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు

రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

అక్షర దర్బార్, హైదరాబాద్ః చేనేత కార్మికులపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందని, వారిపై ఎందుకింత కక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా, కార్మికులు రోడ్డున పడ్డా కనికరించరా అని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం గత ప్రభుత్వంపై కోపంతో నేతన్నల పొట్టకొట్టడం సరైంది కాదని అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు కళకళలాడిన చేనేత రంగం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షోభంలో కూరుకుపోయిందని ఆయన ఆరోపించారు. గత నాలుగు

నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరమవడంతో పాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు ప్రతి కార్మికుని గుండెను గాయపరిచాయని పేర్కొన్నారు. వెంటనే నేతన్నలకు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు అందించి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, నూలు రాయితీని కూడా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మూలన పడిన సాంచాలను తిరిగి తెరిపించేందుకు పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు. ఇక్కడి కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు కమీషన్లకు కక్కుర్తి పడి తమిళనాడు, సూరత్‌కు ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోందని ఆయన ఆరోపించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అక్షర దర్బార్, చిల్పూర్ః అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన పత్రిక ప్రభాకర్, మౌటం రాజశేఖర్ చుట్టు పక్క గ్రామాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముతుంటారు. వీరి అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు గురువారం బియ్యం లారీలో తరలిస్తుండగా రాజవరం వద్ద పట్టుకున్నారు. వీరి వద్ద రూ.5.77లక్షల విలువ చేసే 530 బస్తాల 222 క్వింటాళ్ల బియ్యం, ఒక లారీ, ఫోర్ వీలర్, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, సీఐ రాజు, ఎస్సై ఎండీ.నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఏసీటీవో

అక్షర దర్బార్, ఖమ్మంః వాహనదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కల్లూరు ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ వద్ద వాహనదారుల నుండి అనధికారికంగా, అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు ఏసీటీవో శ్రీరామ్ ను పట్టుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారుల వద్ద ఉండాల్సిన దాని కన్నా అదనంగా రూ.10 వేల నగదు ఉండటాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. డబ్బును, వారి వద్ద ఉన్న పత్రాలను సీజ్ చేశారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది కమర్షియల్ ట్యాక్స్ అధికారిని పట్టుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ సిబ్బంది సెల్ ఫోన్లలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై అనుమానాలు ఉన్నట్లు రమేష్ తెలిపారు.

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పోలింగ్ కేంద్రంలో ఓటరు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేట్లు చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాంటిసోరి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంటు ఎన్నికలు నిర్వహణలో పిఓ, ఎపిఓ విధులు నిర్వహించే సిబ్బందికి నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణ తరగతులను పరిశీలించి ఎన్నికలు నిర్వహణలో అవలంబించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పిఓ, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన కలగి ఉండాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా ఖచ్చితంగా మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఈవిఎం, వివిపాట్ వినియోగంపై పిఓలు, ఎపివోలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని, నిర్లక్ష్యం వల్ల ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది మేనేజ్మెంట్ నోడల్ అధికారులు శామ్యూల్, అవినాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, బిసి సంక్షేమ అధికారి శైలజ, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

నైరాశ్యం

తాజా పరిణామాలతో వరంగల్ కాంగ్రెస్ కేడర్ లో అసంతృప్తి

- కడియం కావ్య అభ్యర్థిత్వంపై వ్యతిరేకత
- ఎన్నికల వేళ జనం వద్దకు వెళ్లడానికి నిరాసక్తత
- ప్రజల్లోనూ కావ్య అభ్యర్థిత్వం పట్ల ప్రతికూల స్పందన
- కాంగ్రెస్ విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో రెట్టింపు ఉత్సాహం కనబరిచిన కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక్కసారిగా నైరాశ్యం చోటు చేసుకుంది. పార్టీలో జరిగిన తాజా పరిణామాలతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రధానంగా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అధిష్టానం కడియం కావ్యను అభ్యర్థిగా ఖరారు చేయడాన్ని హస్తం కేడర్ జీర్ణించు కోలేకపోతోంది. పార్టీలో సభ్యత్వం కూడా లేని కడియం కావ్యను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం వారిని నిరుత్సాహపరిచింది. ఇదే సమయంలో కడియం కావ్య తండ్రి స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీలో మంత్రిగా పనిచేసిన సమయంలో ఇక్కడ తమకు ఎదురైన అనుభవాలను కాంగ్రెస్ పార్టీ కేడర్ ప్రస్తుతం నెమరు వేసుకుంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కడియం కావ్య గెలుపు కోసం ప్రజల వద్దకు వెళ్లడానికి నిరాసక్తత చూపుతుంది. ఇది వరంగల్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయ అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీ అభ్యర్థిగా కడియం కావ్యం ఖరారు చేయడం పట్ల ప్రజల నుంచి కూడా ప్రతికూల స్పందన కనపడుతున్నట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ నేతలు వద్దనుకుంటే కాంగ్రెస్ పార్టీ మళ్లీ వారినే తమ ముందుకు తెస్తుండటాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోని మాదిగ సామాజిక వర్గం కడియం కావ్యకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వరంగల్ నుంచి టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కావ్య అభ్యర్థిత్వాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కడియం కావ్య అభ్యర్థిత్వంపై వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

- సంతోషాన్నిచ్చిన ఫలితాలు

2014 నుంచి వరుసగా పదేళ్ల పాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. ఈ పదేళ్లు కూడా కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికార పార్టీ నేతలు తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని పలు సందర్భాల్లో ఆందోళనకు దిగారు. కొన్ని నియోజకవర్గాల్లో ధర్నా, రాస్తా రోకోలు నిర్వహించారు ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో కొందరు హస్తం పార్టీని వీడారు. అధికార పార్టీ నేతలను ఎదుర్కొన్న అనేకమంది కార్యకర్తలు హస్తం పార్టీలోనే కొనసాగారు. ఎన్ని ఇబ్బందులైనా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తమ శక్తిని ప్రదర్శించారు. చివరకు పదేళ్ల తర్వాత గత డిసెంబర్ లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ కేడర్ లో ఆనందం వెల్లివిరిసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు హస్తం పార్టీ కేడర్ కు సంతోషాన్నిచ్చాయని చెప్పవచ్చు. కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు చేర్చిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడం పట్ల హర్షం వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న గ్యారెంటీలను కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం తమ పార్టీదేననే ధీమాతో ముందుకు వెళ్తున్నారు.

- ఒక్కసారిగా అసంతృప్తి

పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీకి విజయాన్ని చేకూర్చే దిశగా కాంగ్రెస్ కేడర్ ముందుకు వెళ్తున్న క్రమంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. వరంగల్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని హస్తం పార్టీలోని నేతలు పలువురు ఆశించారు. వీరిలో దొమ్మటి సాంబయ్య, సింగపురం ఇందిర, పసునూరి దయాకర్, పరంజ్యోతి, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ నేతలు మాదిగ మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. రాష్ట్రంలో ఉన్న మూడు ఎస్సీ రిజర్వుడు లోక్ సభ స్థానాల్లో నాగర్ కర్నూల్, పెద్దపల్లి నియోజకవర్గాలను కాంగ్రెస్ అధిష్టానం మాల సామాజిక వర్గానికి కేటాయించిన దృష్ట్యా వరంగల్ స్థానాన్ని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించడానికి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వం కోసం బరిలో ఉన్న మాదిగ సామాజిక వర్గం నేతలను పక్కనపెట్టి కాంగ్రెస్ అధిష్టానం అనూహ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ నుంచి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ పరిణామం కాంగ్రెస్ కేడర్ ను ఆందోళనకు గురి చేసింది. కడియం శ్రీహరి తెలుగుదేశం, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కడియం శ్రీహరి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ కేడర్ అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. వీరిలో హస్తం పార్టీ ముఖ్య నేతలతో పాటు కార్యకర్తలు అనేక మంది ఉన్నారు. కడియం శ్రీహరి పైనే రాజకీయంగా తాము సుదీర్ఘ పోరాటం చేస్తే తీరా కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన కూతురుకు తమ పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వటం కాంగ్రెస్ కేడర్ ను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. కాంగ్రెస్ లో సభ్యత్వం కూడా లేని కావ్యను తమ పార్టీ అధిష్టానం వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి అభ్యర్థిగా ప్రకటించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి కడియం శ్రీహరికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన తాము ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో కావ్యకు ఓటు వేయాలని ఎలా కోరగలమని కాంగ్రెస్ కేడర్ నారాజ్ తో కుమిలిపోతుంది. ఇదే సమయంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోని నేతలను వద్దనుకొని కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేస్తే అదే బీఆర్ఎస్ లోని నేతలు కాంగ్రెస్ లోకి రాగానే వారిని అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించి తమ ముందు పెట్టడాన్ని ప్రజలు కూడా తప్పుపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. ఇదిలా ఉంటే వరంగల్ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టికెట్ ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. దీంతో కడియం కావ్య అభ్యర్థిత్వంపై ఇప్పుడు హాట్ టాపిక్ నడుస్తుంది.

పోస్టర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : సింగరేణి పరిరక్షణ కార్మిక హక్కుల కోసం ఈనెల 7వ తేదీన గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగే తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ మహాసభలకు సింగరేణి కార్మిక సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య పిలుపునిచ్చారు ఈ మేరకు గురువారం భూపాలపల్లిలోని బాతల రాజ్ భవన్ లో పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పేద వర్గాల ప్రజలు ఆర్థికంగా సామాజికంగా ఎదిగి గౌరవప్రదంగా జీవించడానికి సింగరేణి దోహద పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామాల శ్రీనివాస్ , కిరణ్ , కాసర్ల ప్రసాద్ రెడ్డి, దాసరి జనార్ధన్, శ్రీధర్ కలకోటి లింగన్న రమేష్, డి.సుదాకర్ తదితరులు పాల్గొన్నారు

భారీ బహిరంగ సభను

విజయవంతం చేయండి

- సభకు అధిక సంఖ్యలో తరలిరండి
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపు
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఈనెల 6న సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పాల్గొనున్న తుక్కుగూడ జన జాతర బహిరంగ సభకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కాంగ్రెస్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికలలో దేశమంతా అమలుపరిచే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో తుక్కుగూడ భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విడుదల చేస్తారని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు . కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల శ్రేణులు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.